# భూమి గుండ్రముగానే వుంది

"ఏమండి బి. ఎ. ఎకనామిక్సు క్లాసు యెక్కడో కొంచెము దయచేసి చెప్తారా" అని అడిగింది స్వయంప్రభ కారిడర్‌లో నుంచున్న ఒక అమ్మాయిని.

అది మద్రాసులోవున్న ఒక స్త్రీల కళాశాల. ఆ రోజే ఎండాకాలము శెలవులతరువాత కాలేజి మొదలుపెట్టారు పాత విద్యార్థినులు తమ 'స్నేహితులను కలుసుకొనే హడావుడిలో వుంటే కొత్త విద్యార్థినులు తమ క్లాసులు వెతుక్కునే హడావుడిలో వున్నారు.

ఏమి చేయ్యాలో పాలుపోక ఆలోచిస్తున్న సులోచన ఎవరో తనని మాట్లాడించటముతో ఉలిక్కిపడిచూచింది ఎదురుగా ఒక అందమైన అమ్మాయి తనవైపే చూస్తూ కనపడింది. నొక్కునొక్కుల జుట్టు, పసిడివన్నెఛాయ' ఈ కాలేజి గందరగోళమంతచూసి బెదురుతున్నట్లువున్న పెద్దపెద్ద కళ్ళు, కళ్ళతో మీకన్న మేమే బాగున్నామంటు పోటీ చేస్తున్న వంపుదిరిగిన కనుబొమ్మలు, లిప్‌స్టిక్ ఎందుకు వాడ్తారు అని అడుగుతున్న ఎఱ్ఱటి పెదవులు, వంపులు దిరిగిన నాజూకైన శరీరము;

"మీరు నన్నేనా పలుకరించింది" అంది సులోచన.

"అవును మిమ్మల్నే నేను కాలేజీలో క్రొత్తగాచేరాను బి. ఎ. ఎకనామిక్సు క్లాసు ఎక్కడో తెలియటము లేదు. మీకు తెలుసేమోనని అడిగాను."

"అబ్బే నాకు తెలియదు. నేను అందుకోసమే వెతుకుతున్నాను. నేను కూడ ఈ కాలేజీకి క్రొత్తేనండి".

"అయితే మీరు ఎకనామిక్సు బి. ఎ. నా ?"

"అవునండి"

"మరి మీ సబ్‌సిడరీ ఏమిటండి"

"పొలిటిక్స్ అండ్ హిష్టరీసు"

"అయితే యిద్దరము ఒక గ్రూపేనే ఎవరు తోడు లేరు అనుకొంటున్నాను. మీరు దొరికారు"

"మీ పేరేమిటండి ?"

"స్వయంప్రభ ప్రభ అని పిలుస్తారు. మీపేరు?"

"సులోచన"

"మీరు హాష్టలులో వుంటున్నారా?"

"అవునండి"

"మీ మొహము చూడగానే అనుకొన్నాను. ఎక్కడో చూచినట్లువుంది అని ఆయినా వచ్చిన తరువాత హాష్టలులో సామానులు పడేసి కాలేజీకి వెంటనే వచ్చేసాను. అందుకని మీరు బాగా జ్ఞాపకము లేకపోయారు. ఇంతకీ ఏ నెంబరు రూమ్‌లో వుంటున్నారు?"

"పన్నెండవ నెంబరు రూములో దిగానండి"

"అరే యిద్దరము ఒక రూమె"

"నిజంగా! బలే! అయితే మనము మంచి ఫ్రెండ్సు అవొచ్చన్న మాట"

"అహ"

"ఇద్దరు ఒకర్నిచూసి ఒకరు నవ్వుకున్నారు. "రా ప్రభ ఎవరినైన కనుక్కొని క్లాసుకు వెళ్దాము ఇప్పటికే చాల టైమయ్యింధి" అంది సులోచన

♦ ♦ ♦

ప్రభ సులోచనలు మంచి స్నేహితులై పోయారు. ఇద్దరు చదువులో ఒకరికొకరు తీసిపోరు. ఒకరు ఫస్టు

కుమారి కె. దివ్యజ్ఞాన సరోజినిదేవి

వస్తే ఒకరు సెకండు, కాని వారిలో ఒకరిపై ఒకరికి ఈర్ష్య ఏమాత్రము వుండేదికాదు. అందుకే అందరికి వారి స్నేహము ఆశ్చర్యము కలుగచేసేది. అందములో కూడ ఒకరి కొకరు తీసిపోరు. ప్రభ ఈ విషయములో ఒక్క మెట్టు ఎక్కువైనప్పటికి సులోచనని చూచిన వారంత అందమైన అమ్మాయని అనుకోకుండవుండరు. వారిద్దరు ఎప్పుడు ఒకర్ని ఒకరు వదలి వుండేవాళ్ళుకాదు. హాస్టలు నుంచి కాలేజీకిఒకేసారి వచ్చేవారుయిద్దరు. క్లాసులోకూడ ప్రక్క-ప్రక్కన కూర్చునేవాళ్ళు. వాళ్ళ అలవాట్లు నడవడి అన్ని వకటె." కవలలై పుట్టివుండాలిసింది" అని అనే వాళ్ళు. వాళ్ళ యిద్దరిని చూచిన వాళ్ళంతా.

ఒక నెలరోజులు యిట్టే దొర్లిపోయాయి. ఆ రోజు శనివారము అవటముచేత ప్రభ తీరిగ్గా తన మంచము మీద కూర్చుని ఏవో వుత్తరాలు చదువుకుంటోంది. ఆ సందడిలో తన రూంమేటు దుర్గరావటము కూడ చూడలేదు: దుర్గ ప్రభను యేదో మాట్లాడించబోయి, ప్రభ చేతిలోవున్న "ఫారిన్ ఎర్‌మేల్" ఉత్తరము చూచి ఏమిటో నవ్వుకుంటూ మెల్లగా జారుకుంది. స్నానము చేసి అప్పుడేవచ్చిన సులోచన తనలో తను నవ్వుకుంటున్న దుర్గను చూసి యేమిటి సంగతన్నట్లు కళ్ళతోనే ప్రశ్నించింది. దుర్గ యేదో సులోచన చెవులో వూదింది. ఇద్దరు అర్థమయినట్లు ఒకర్ని చూచి ఒకరు నవ్వుకున్నారు సులోచన మెల్లగా దగ్గుతూ "తెలిసిందిలెండి ఒక అమ్మాయి రహస్యము" అంది "ఏమిటి తెలిసింది"అని ఉలిక్కిపడి చూచింది ప్రభ.

"తమరు ఎందుకు అంత ఆనందముగా వున్నారో ఆ వుత్తరాలు ఎందుకు అంత యింటరస్టింగా వున్నవో"

"బాగుంది దీంట్లో రహస్య మేముంది? ఉత్తరాలు అందులో అమ్మదగ్గరనుండి అన్నయ్యదగ్గరనుండి వస్తే ఏ హాస్టలు గర్లు ఎగిరి గంతెయ్యదు?"

"మీ అన్నయ్య దగ్గరనుంచా" అంది సులోచన తెల్లబోతూ.

"అవును మా అన్నయ్య దగ్గరనుంచే. ఓహో ! నీవు యేవనుకున్నావో నాకిప్పుడర్థమయిందిలే. అయితే మా అన్నయ్య గురించి నీకు చెప్పలేదా?" ఈ మధ్య పరీక్షల హడావుడిలో వుండి వుత్తరాలు వ్రాయటము మాని వేసాడు. ఇప్పుడు అమెరికాలో వుండి చదువుతున్నాడు. అమ్మకేమో అక్కయ్య పెళ్ళి అన్నయ్య పెళ్ళి చేసేయ్యాలని అందుకని అన్నయ్యని ఒకసారి వచ్చిపొమ్మంటుంది. మా అత్తయ్య కూతురొకమ్మాయి శకుంతల అని వుందిలే రెడిగా తను కూడా బెజవాడలో బి.ఎ. చదువుతుంది. చాల అందముగా వుంటుంది. మంచి పిల్లకూడ. శకుంతల పాడుతూవుంటే రాళ్ళే కరిగిపోతాయాఅన్నట్లు వుంటుంది. అన్నయ్యకు శకుంతలంటె చాల యిష్టమే గాని యిప్పుడు పెళ్ళి వద్దంటాడు యింకొక రెండుసంవత్సరాలదాకా యిండియాకు రానంటాడు."

"ఓహో ! అట్లాగా"

"సరేగాని నీకు బలేమంచివార్త చెప్పాలి"

"ఎమిటది?"

"అమ్మ వ్రాసింది సులోచన అనే మన బంధువులమ్మాయి నీ క్లాసులోనే చదువుతుందట, తెలుసా అని"

"బలే మనము బంధువులుకూడ అన్నమాట"

"అన్నమాటే" యిద్దరు పక్కున నవ్వుకున్నారు.

♦ ♦ ♦

మొదటసంవత్సరము గడిచిపోయింది. ఎండాకాలము సెలవులకి ప్రభ బెజవాడ సులోచన రాజమండ్రి బయలుదేరారు. వారికి ఒకర్నివిడచి ఒకరు వుండటము చాల కష్టమనిపించింది. రెండురోజుల కొకసారి తప్పకుండ ఉత్తరాలు వ్రాసుకోవాలని తీర్మానించుకొన్నారు సులోచన రాజమండ్రి చేరగానే ఉత్తరము వ్రాసింది. ప్రభ వెంటనే జవాబు యిచ్చింది. ఇట్లా ఒకనెల గడిచిపోయింది. ఉన్నట్లుండి ప్రభ దగ్గరనుండి ఉత్తరాలు రావటమే మాని వేసినవి. సులోచన ఎంతో గాబరాపడింది. వెంటనేక్షేమం గురించి జాబువ్రాయమని ఏన్నో ఉత్తరాలు వ్రాసింది. కాని వేటికి జవాబులేదు. ఇహ చేసేదిలేక సులోచన ఎప్పుడెప్పుడు కాలేజి తెరుస్తారా, ఎప్పుడు ప్రభను చూద్దామా అని ఎదురు తెన్నులు చూడసాగింది, ఆ మూడు నెలలు సులోచనకు మూడు యుగాలనిపించినవి. ఎలాగైతేనేమి కాలేజి తెరిచేరోజు దగ్గిర పడింది.

హాస్టలు ప్రవేశించిన సులోచన కళ్ళు ప్రభ కోసరము వెతకసాగాయి. సులోచన్నుచూసి ప్రభ ఒక్కపరుగులో వచ్చింది. ఇద్దరు ఒకరినొకరు గట్టిగాకౌగలించు కొన్నారు ఇది చూస్తున్న మిగిలిన హాస్టలుపిల్లలు పక్కున నవ్వారు

"అదేమిటి ప్రభ నా ఉత్తరాలకి జవాబే వ్రాయలేదు" సులోచనను చూచి విప్పారిన ప్రభ ముఖము ఒక్కసారి ఈ ప్రశ్నతో ముడుచుకు పొయ్యింది.

"చాలకథ వుందిలె మనస్సు బాగుండక వ్రాయలేదు"

"ఏమి జరిగిందేమిటి"

"రా రూములోకి పోయి మాట్లాడు కొందాము"

రూములోకి వెళ్ళగానే ప్రభ వెక్కి వెక్కి ఏడవటము మొదలు పెట్టింది. సులోచన "ఎమిటి ప్రభ ఎందుకలా ఏడుస్తావు. ఏమైందో చెప్పు ప్రభ నీవలా ఏడిస్తే నాకేమి టోలాగ అనిపిస్తుంది. ఏడవకు" అని ఓదార్చింది.

"ఇంతకీ ఏమైనట్లు?"

"శకుంతల చనిపోయింది"

"అవును ఎపెండిసైటిస్ వచ్చి అకస్మాత్తుగా చనిపోయింది. అన్నయ్యా ఈవార్త విని యింటికి రానంటాడు అమ్మ శకుంతలను కూతురులాగ చూసుకొనేది. అమ్మ శకుంతల చావుతో అన్నయ్య ఉత్తరముతో గాబరాపడి పోయింది. చిక్కి సగమయింది! నేను కాలేజీకి వెళ్ళనంటే ఒద్దమ్మ వెళ్ళు అని బలవంతపరచి పంపింది. ఏట్లా అయితేనేమి అన్నయ్యా ఈ సంవత్సరాఖరుకు వస్తానవిమాటయిచ్చాడు. ఇలాఅయింది సులోచనా నాన్న ఎలానులేడు. ఉన్న అమ్మకూడ ఈ తీరు అయేటప్పటికి నాకు అక్కయ్యాకు చాల గాబరాఅయింది" అని అన్నది వచ్చే కన్నీళ్ళ నాపుకుంటు ప్రభ, "ధైర్యము వహించు ప్రభ. మీ అన్నయ్యారాకతో మీ అమ్మకు మళ్ళీ బాగవుతుందిలే. ప్రభ నీ బాధ నేను అర్ధము చేసుకోగలను, కాని జరిగిపోయిన దానికి యేడ్చి యేమిలాభము చెప్పు ధైర్యము వహించాలిగాని" అని సులోచన ప్రభ ముఖము తన వైపు తిప్పుకుంటు ఓదార్చింది. ప్రభ సులోచనవైపు మౌనంగా చూస్తువుండి పోయింది.

రెండు సంవత్సరాలు గిర్రున తిరిగిపోయినవి. ప్రభ సులోచనలకి ఆ రెండు సంవత్సరాలు రెండు నిమిషాలు లాగ గడిచిపోయినవి. పరీక్షలు గూడ అయిపోయినవి. ప్రభ సులోచనలు పాసుకావటములో అసలు సందేహము లేకపోయింది. విడిపోవలసి వస్తుందే అని వాళ్ళ బాధ పడటము మొదలు బెట్టారు. ఎంత వద్దనుకుంటున్నా అఖరి రోజు రానేవచ్చింది. హాస్టలంతా గందరగోళంగా వుంది. ఏడ్చేవాళ్ళు ఏడుస్తున్నారు, ఓదార్చేవారు ఓదారుస్తున్నారు. కన్నీరు కార్చేవాళ్ళని చూసి ఎగతాళి చేసేవాళ్ళు చేస్తున్నారు, కొంత మంది ఆటోగ్రాఫులు పట్టుకొని వేటకు బయలు దేరారు. కొందరు సర్దుకొనే హడావుడిలో వున్నారు. కొందరు ఏవేవో మాట్లాడుకుంటూ హాస్టలంత ప్రతిధ్వనించేటట్లు నవ్వుతున్నారు. పరీక్ష బడలిక తీరక యింకా నిదురపోతున్నారు మరి కొందరు.

ప్రభ సులోచనలు ఓ మూల నిశబ్దముగా కూర్చున్నారు. ఇద్దరికి దుఃఖము ముంచుకొస్తుంది, దైలుకి వైమవుతుంది. కాని ఎవరు కదలటమూలేదు, మాట్లాడటము లేదు, ఇంతలో అటు వచ్చిన వార్డను అది చూసి "బాగుంది వరుస ఎప్పుడో ఒకప్పుడు విడిపోవలసిన వారేగదా! యింత కష్టపడితే ఎలా? కనీసము పెళ్లయిన తరువాతైనా విడిపోవాలిగా, లేకపోతే యిద్దరు ఒకర్నే చేసుకుందా మనుకున్నారేమిటి" అని అంది. ఆ మాటలకు అక్కడ వున్న కొందరు పిల్లలు గొల్లుమని నవ్వారు. సులోచన ప్రభలు కూడ నవ్వకుండా వుండ లేకపోయారు.

♦ ♦ ♦

"శేషు. జయింతి పెళ్ళితో నీదికూడ అయిందనిపించరాదురా? పోయిన వాళ్ళ కోసరము విచారిస్తు కూర్చుంటె ఎలా?" అని మెల్లగా అడిగింది శేషగిరి రావును విశాలాక్షమ్మ.

"శకుంతల లాంటి పిల్ల దొరికితే ఆలాగే చేసు కుంటాలేమ్మ."

"మరి నీవు జయంతి పెళ్ళవగానే అమెరికా వెళ్ళిపోవాలంటున్నావుగా."

"మరి నన్నేంచెయ్యమంటావమ్మ వెంటనే వెళ్ళకపోతే నిక్షేపంలాంటి ఉద్యోగం పోతుంది"

"ఎందుకురా ఉద్యోగము కోసరము అంత దూరము పోవటము ఇక్కడ దొరకకా? పెళ్ళిచేసుకొని నా కళ్ళ ముందుంటె. నా కెంత ఆనందముగా వుంటుంది"

"అంత మంచి ఉద్యోగము యిక్కడేలా దొరుకుతుంది?"

"అయితే వెంటనే వెళ్ళటము తప్పదంటావు."

"అవునమ్మ."

"సరే నాయినా నీ యిష్టము, నీకు జయంతికి ఒకేసారి పెళ్లిచెయ్యాలని యెప్పుడు అనుకొనేదాన్ని. నా కర్మ కాలి యిట్లా అయింది ఎక్కడ వుందో నీవు యిష్టపడే అమ్మాయి. శకుంతల మనని ఈలా మోసము చేసి వెళ్ళిపోకుండపుంటే నీ పెళ్ళికూడ నా కళ్ళతో చూచెదాన్ని కదా" అంటూ చెంగుతో కన్నీళ్ళు తుడుచుకొంది విశాలాక్షమ్మ.

"అన్నయ్యా నన్ను యివ్వాళ స్టేషనుకు తీసికెళ్ళాలి" అంటూ వచ్చింది ఇంతలో ప్రభ పరిగెత్తుకుంటూ.

"స్టేషనుకా? ఏమిటి విశేషము? యివ్వాళ అమ్మాయి గారి ముఖము ఆలా వికసించిందేమి?"

"సులోచన అని నా స్నేహితురాలు ఒక అమ్మాయి వుందని చెప్పానే. ఆ అమ్మాయికి పెళ్ళికి రెండు రోజులు ముందువస్తే సరదాగ గడపొచ్చని వ్రాశాను. వాళ్ళు మన బంధువులే. వాళ్ళ అమ్మనాన్న వాళ్ళకు నీవు ఆహ్వానము పంపేవుంటావు. ఇంతకీ నా ఉత్తరానికి తను వెంటనే బయలుదేరి వస్తున్నానని. పెళ్ళికి ముందురోజు వాళ్ళ అమ్మనాన్నగారు వస్తారని వ్రాసింది. ఇప్పుడు నేను ట్రైనుకి వెళ్ళి రిసీవు చేసుకోవాలి."

"అదా సంగతి. సరే అట్లాగేలే"

ఆ రోజు రైలు మూడు గంటలు లేటైంది. ఎలా అయితేనేమి రైలు వచ్చింది. ప్రభ గబగబ కంపార్టుమెంటులు వెదకసాగింది. శేషగిరిరావు చూస్తు నిలబడి పోయాడు ప్రభ సులభముగానే సులోచన కంపార్టుమెంటు కనుక్కుంది. ప్రభతో వస్తున్న సులోచన వంక చూసి శేషగిరిరావు ఎంత చక్కటి అమ్మాయి అని అనుకున్నాడు. ప్రభ శేషగిరిరావుకు సులోచనని పరిచయము చేసింది. సులోచన సిగ్గుతో తలవంచుకొని "నమస్కారము" అన్నది. ప్రతి నమస్కారము చేస్తు శేషగిరిరావు చదువుకున్న అమ్మాయిలకి కూడ యింత సిగ్గేనా అని తనలో తను అనుకొని నవ్వుకున్నాడు. ఏలా అయితేనేమి మరల కలుసుకొన్నందుకు ప్రభ సులోచనలు సంతోషించారు. ఇంటికి వెళ్ళే దారిపొడుగునా వారు వాళ్ళ కాలేజీ సంగతులు తప్ప మరేది మాట్లాడుకోలేదు.

సులోచనకూడ ప్రభకు పెళ్ళిపనులలోసహాయముచేయ సాగింది. రెండు రోజులుగా సులోచనని చూస్తున్న విశాలాక్షమ్మ ఆ అమ్మాయి అందము, వినయము చూసి ఎంతో మెచ్చుకుంది. ఏదో మనస్సులో మెదలింది. రేపు పెళ్ళనగా శేషగిరిరావుని పిలిచి యేదో బుజ్జగించి చెప్పింది, శేషగిరిరావు చివరకు అంగీకార సూచనగా తల త్రిప్పాడు. ఇదంత వింటున్న ప్రభ సంగతి గ్రహించి సులోచన వంక కొంటెగా చూసింది. ఆ రోజు సాయంకాలమే సులోచన తల్లిదండ్రులు వచ్చారు. వారిని వెంటనే ప్రక్కకి తీసుకువెళ్ళి విశాలాక్షమ్మగారు యేదో సంప్రతించారు. సంగతి గ్రహించుకున్నా సులోచన సిగ్గుతో తల వాల్చుకుంది.

ఆ మరునాడు ఒక వివాహము బదులు రెండు వివాహములు జరగటము చూచి అందరు ఆశ్చర్యపోయారు. సంగతి తెలుసుకొని చాల సంతోషించారు. రెండు వివాహములు మహా వైభవముగా జరిగిపోయినవి. ప్రభ ఆనందానికి అంతేలేదు. నూతన దంపతులు గృహప్రవేశము గావించగానే ప్రభ కొంటెగా సులోచన బుగ్గ గిల్లుతూ.

"అమ్మా ! ఎట్లా అయితేనేమి మరల మనమిద్దరము ఒకే చోటుకి చేరాము గదూ?" అన్నది.

"అవును ప్రభ భూమి గుండ్రముగానే వుందిగా" అన్నది చిరునవ్వుతో బుగ్గ సవరించుకుంటూ సులోచన.

